## క్లుప్తంగా

### 22న మెగా ఉచిత వైద్య శిబిరం

బడంగ్‌పేట్: ఎస్‌వీఎస్ ట్రస్ట్, వైష్ణవ సేవా సంఘం బడంగ్‌పేట వారి సౌజన్యంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 22న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం వరకు శిబిరం కొనసాగుతుందని చక్రవర్తుల జగన్మోహనాచార్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మేడీ కవర్ హాస్పిటల్, మా ఈఎన్‌టీ హాస్పిటల్, గ్లోబల్ ఐ హాస్పిటల్, శ్రీకృష్ణ న్యూరో హాస్పిటల్, లక్ష్మీ హెల్త్ కేర్ హాస్పిటళ్ల నుంచి న్యూరో సర్జన్లు, జనరల్ సర్జన్లు, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, డెంటల్, గైనకాలజీ, ఈఎన్‌టీ, మూత్రకోశవ్యాధి నిపుణులు, ఆయుర్వేదిక్, పంచకర్మ సంబంధించిన ప్రముఖ వైద్యులు రానున్నారని తెలిపారు. ఉచితంగా మందులు కూడా పంపిణీ చేయనున్నారు. మంత్రి సబితారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ప్రజలు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధి కొత్తపేట చౌరస్తాలోని పీవీటీ కాంప్లెక్స్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఫేస్ క్లినిక్ డెంటల్ అండ్ ఐ కేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశ్రాంత ఎస్పీ నోముల మురళీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీవీటీ మార్కెట్ మర్చంట్ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి భువనగిరి శ్రీనివాసులు ఫ్రీ క్లినిక్ సేవలను ఆయన అభినందించారు. ప్రతి ఒక్కరూ మారుతున్న కాలానుగుణంగా ఆరోగ్య పరీక్షలను ఎప్పటికప్పుడు చేయించుకుంటే ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి తడక కృష్ణ, కోశాధికారి భిక్షపతి, డైరెక్టర్‌లు ప్రసాద్‌కుమార్, సురేష్, రెడ్డయ్య, పోచయ్య, రాజేంద్ర ప్రసాద్, రాజు, మేనేజర్ జెల్ల నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని పోచమ్మ గుడి వద్ద గురువారం సీసీ రోడ్డు పనులను స్థానిక యాదవసంఘం నాయకుడు బైకని శ్రీశైలం యాదవ్ ప్రారంభించారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో రోడ్డు వేస్తున్నట్లు బైకని శ్రీశైలం యాదవ్ వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, జనిగల గిరి, నర్సింహ, రాములు, వెంకటయ్య, అశోక్‌యాదవ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్లు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.17.50 లక్షలతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు కౌన్సిలర్లు మేతరి అనురాధ, మర్రి మాధవి గురువారం శంకుస్థాపన చేశారు. కిచెన్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, వాటర్ ట్యాంక్, ఎలక్ట్రీషియన్ పనులతో పాటు, మరమ్మతులు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్, నాయకులు సామ భీంరెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, మేతరి దర్శన్, రేవల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### రుణ లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలి

డీఆర్‌డీఓ పీడీ ప్రభాకర్




సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

ఆమనగల్లు: ప్రభుత్వం అందిస్తున్న రుణాల లక్ష్యాలను బ్యాంకర్లు సకాలంలో పూర్తిచేయాలని డీఆర్‌డీఓ పీడీ ప్రభాకర్ కోరారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లోగురువారం సంయుక్త బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. లీడ్‌బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు చెందిన వివిధ బ్యాంకుల మేనేజర్లు, ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహిళాసంఘాలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు డీఆర్‌డీఏ మరియు వివిధ కార్పొరేషన్ల నుంచి మంజూరైన రుణాలను సకాలంలో అందించాలని బ్యాంకర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు ఫారూక్‌హుస్సేన్, రాఘవులు, ఏపీడీ జంగారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి, ఏఓలు శ్రీలత, అరుణకుమారి, వివిధ బ్యాంకుల మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

# పుస్తకాలతో దోస్తీ.. పోటీ పరీక్షలకు కుస్తీ



సరూర్‌నగర్ శాఖ గ్రంథాలయం

- పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అండగా
- సరూర్‌నగర్ శాఖా గ్రంథాలయం
- అందుబాటులో 20వేల పుస్తకాలు



పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులు

హుడాకాంప్లెక్స్: ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ కోసం ఇటీవల పెద్ద సంఖ్యలో నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో స్థానిక యువతే కాదు శివారు జిల్లాలకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులు సైతం నగరానికి చేరుకున్నారు. పోటీ పరీక్షల కేంద్రాల్లో శిక్షణ పొందుతున్నారు. ఇతర సమయంలో సరూర్‌నగర్‌లోని శాఖా గ్రంథాలయాన్ని ఆశ్రయిస్తున్నారు. ప్రశాంతమైన వాతావరణంతో పాటు పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ మొత్తం ఒకేచోట లభిస్తుండడంతో యువత పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తున్నారు. ఫలితంగా నిన్న మొన్నటి వరకు ఖాళీగా కనిపించిన లైబ్రరీ హాళ్లు, కుర్చీలు ప్రస్తుతం పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులతో కలకలలాడుతున్నాయి.

**చదువుతూ.. నోట్ చేసుకుంటూ..**

పోలీసు కానిస్టేబుల్, గ్రూప్ –1 ,2, 3, 4 పోటీ పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌తో పాటు చరిత్ర, పరిశోధన ప్రముఖ గ్రంథాలు, తెలుగు, ఇంగ్లిష్ డైలీ, వార, పక్ష పత్రికలు అందుబాటులో ఉంచుతున్నారు. అభ్యర్థులు ఆయా పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ఎంపిక చేసుకుని రోజంతా చదువుతున్నారు. ముఖ్యమైన అంశాలను ఎప్పటికప్పుడు నోట్‌బుక్‌లో నమోదు చేసుకుంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి చదువుకునేందుకు ఇక్కడికి వచ్చిన అభ్యర్థులకు లైబ్రరీ నిర్వాహకులు మంచి నీరు, 50 కుర్చీలు, టేబుళ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు.

**అన్ని పుస్తకాలు ఉన్నాయి**

సరూర్‌నగర్ శాఖా గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. మెటీరియల్ కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత లేనివారికే కాదు.. ఏ పరీక్షకు ఎలా ప్రిపేర్ కావాలో తెలియని అభ్యర్థులకు ఇది ఉపయుక్తంగా ఉంది.

– సుమలత, గ్రూప్–1 అభ్యర్థి

**ఉదయం నుంచి రాత్రి వరకు..**



లైబ్రరీలో మొత్తం 20 వేలకుపైగా పుస్తకాలు ఉన్నాయి. అన్ని తరగతులకు సంబంధించిన తెలుగు అకాడమీ పుస్తకాలతో పాటు వివిధ స్టడీ సర్కిళ్లకు సంబంధించిన మెటీరియల్ కూడా అందుబాటులో ఉంది. ఇక్కడికి రోజుకు కనీసం 200 మంది అభ్యర్థులు వస్తుంటారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు లైబ్రరీ తెరిచి ఉంటుంది. ఎవరైనా వచ్చి చదువుకోవచ్చు. ప్రశాంతతకు భంగం కలిగించే ఫోన్లు, ఇతర ఎల్రక్టానిక్ వస్తువులను అనుమతించడం లేదు.

– వీరయ్య, పీటీడబ్ల్యూ

## క్రీడల్లో గెలుపోటములు సహజం

సర్పంచ్ కాకి ఇందిర



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ ఇందిర, తదితరులు

కందుకూరు: గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని అన్నోజిగూడ సర్పంచ్ కాకి ఇందిర సూచించారు. మండలంలోని అన్నోజిగూడలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు గురువారం ఆమె బహుమతులు ప్రదానం చేశారు. మొదటి స్థానంలో నిలిచిన ఎన్టీఆర్ తండా జట్టుకు రూ. 5 వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన బండమీది గూడూరు జట్టుకు రూ. 2500 నగదుతో పాటు షీల్డ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహభావం ఏర్పడడంతో పాటు మానసిక, శారీరకధారుడ్యం పెంపొందుతుందన్నారు. అందరూ క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పీ శ్రీహరి, కాకి దశరథ, సేవాలాల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాంరాథోడ్, వార్డు సభ్యులు కృష్ణ, మహేందర్, లక్ష్మణ్, వేణు, సురేష్, నిర్వాహకులు ఢిల్లీ శివ, మల్లేష్, సుధాకర్, కిరణ్, చింటు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శుక్రవారం 11కేవీ నందిహిల్స్, 11కేవీ ప్రశాంతిహిల్స్, 11కేవీ కేశవరెడ్డినగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏ ఈ ఎస్ ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్స్ కాలనీ, నందిహిల్స్, ప్రశాంతి హిల్స్, వినాయకనగర్, చైతన్య హిల్స్, డీఎల్ఆర్ఎల్ కాలనీ, శివగంగ హిల్స్, న్యూబాలాజీ నగర్, సిర్లాహిల్స్, రాఘవేంద్ర కాలనీ, డైనమిక్ కాలనీ, కేఆర్ఆర్ హిల్స్, సెవెన్ హిల్స్, కేశవరెడ్డి నగర్, శివసాయినగర్, టీఎస్ఆర్ నగర్, సీతా హోమ్స్, శివా హిల్స్, అల్మాస్‌గూడ కమాన్ కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ తెలిపారు.

**హుడాకాంప్లెక్స్ పరిధిలో..**

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ పుష్పాగార్డెన్, డెంటల్ కళాశాల, జనప్రియ కాలనీ, శివంహిల్స్, వీరభద్రనగర్, హుడాసాయినగర్, చిత్రా లేఅవుట్, వీ–గార్డ్, దేశ్‌ముఖ్‌కాలనీ, పసుమాముల, తారామతిపేట, కొహెడ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, అలాగే 11కేవీ జీఎస్ఐ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

## ఆలయ అభివృద్ధికి నిధులివ్వండి

- పాలక మండలి సభ్యులు
- కమిషనర్‌కు వినతిపత్రం అందజేత



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆలయ పాలక మండలి సభ్యులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ పాలక మండలి సభ్యులు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ ఆలయ చైర్మన్ గోనమోని శివశంకర్ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి రూ. 50 లక్షలు కేటాయించాలని తాము కోరినట్లు తెలిపారు. కమిషనర్‌ను కలసిన వారిలో పొట్టల భాస్కర్, ఆలయ పాలక మండలి సభ్యులు ఉన్నారు.

## అదుర్స్.. కెనడియన్ వుడ్ విల్లా



తుమ్మలూరులోని కెనడియన్ వుడ్ విల్లా వద్ద కెనడా ప్రతినిధుల బృందం

కెనడా మంత్రిత్వ శాఖ, డిప్యూటీ మినిస్టర్ రిచర్డ్ గై మాన్వరింగ్

మహేశ్వరం: కెనడియన్ వుడ్‌తో నిర్మించిన విల్లాలు అద్భుతంగా ఉన్నాయని కెనడా అటవీ మంత్రిత్వ శాఖ, డిప్యూటీ మినిస్టర్ రిచర్డ్ గై మాన్వరింగ్ పేర్కొన్నారు. కెనడాకు చెందిన ఫారెస్ట్రీ ఇన్నోవేషన్ ఇన్వెస్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా మిషన్ ప్రోగ్రామ్ – 2023లో భాగంగా కెనాడ అటవీ మంత్రిత్వ శాఖ, డిప్యూటీ మినిష్టర్ రిచర్డ్ గైమాన్వరింగ్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం మండలంలోని తుమ్మలూరు గ్రామం మ్యాక్ ప్రాజెక్టులోని కెనడియన్ వుడ్ ప్రాజెక్టును గురువారం సందర్శించింది. మ్యాక్ బీటీఆర్ భారత దేశంలో పర్యావరణహితంగా విలాసవంతమైన చెక్క గృహాలను అభివృద్ధి చెయడానికి, ప్రోత్సహించడానికి కెనడియన్ వుడ్ సంస్థతో కలిసి పని చేస్తోంది. కార్యక్రమంలో కెనడియన్ ప్రతినిధి బృందం సభ్యులు పెర్రీ జోనాథన్ టీస్టేల్, బ్రూస్ సెయింట్ జాన్, జాన్ లాంగ్లీ, సుఖ్‌దేవ్ దేవిడ్, మైఖల్ లోసెత్, మ్యాక్ ప్రాజెక్టు ప్రతినిధులు అమీనా మహమూద్ ఖాన్, మీర్ ఐనమ్ అలీ ఖాన్, అనుపమ్ కపూర్ పాల్గొన్నారు.

## ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి
- 'మన ఊరు – మన బడి'పై సమీక్ష
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం పట్టణాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్ది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. గురువారం మహేశ్వరం ఎంపీడీఓ సమావేశం హాలులో మన ఊరు–మన బడి కార్యక్రమంపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మహేశ్వరంలో స్కూళ్లు, హాస్టళ్లు, జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే తుక్కుగూడలోపాలిటెక్నిక్ కళాశాల, డైట్ కళాశాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీంతో విద్యాలయాలకు చిరునామాగా మహేశ్వరం నియోజకవర్గం మారుతుందన్నారు. మొదటి విడత మన ఊరు – మన బడి కార్యక్రమానికి రూ. 16 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మహేశ్వరం మండలంలోని 33 ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులకు రూ. 2కోట్లకు పైగా నిధులు మంజూరైనట్లు మంత్రి వెల్లడించారు. నియోజకవర్గంలో నాలుగు జూనియర్ కళాశాలలకు రూ. 6కోట్ల 55లక్షలతో నూతన గదులు, ప్రహరీ, ఇతర పనులు చేస్తున్నట్లు చెప్పారు. మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కోటి మంజూరు చేశామన్నారు. మోడల్ స్కూల్‌లో రూ. 4 కోట్లతో ఒక ఫ్లోర్, హాస్టల్, ప్రహరీ పనులు చేపట్టామని త్వరలో ప్రారంభిస్తామన్నారు. మహేశ్వరం కేజీబీవీ జూనియర్ కళాశాల భవనానికి రూ. 2 కోట్ల 30 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. మన ఊరు – మన బడి కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ సుశీంధర్ రావు, ఎంపీపీ రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునితానాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ మహమూద్ అలీ, ఎంపీడీఓ నర్సింహ, ఎంఈఓ కృష్ణ, ట్రైబల్, మైనార్టీ, సోషల్ వెల్ఫేర్ ఆర్‌సీఓలు కళ్యాణి, శ్రీనివాస్‌రెడ్డి, శారద, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**పనులు వేగవంతం అవ్వాలి**

కందుకూరు: మన ఊరు – మన బడి పనులు వేగవంతం అవ్వాలని మంత్రి సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులతో మన ఊరు – మన బడి కార్యక్రమంపై గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీలు, కిచెన్ షెడ్లు, ప్రహరీలు తదితర సమస్యలతో పాటు మౌలిక సదుపాయాలను గురించి ప్రజాప్రతినిధులు మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. మొదటి విడతలో మన ఊరు – మన బడి పథకం కింద ఎంపికైన పాఠశాలల అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేస్తే, రెండో విడతలో మరిన్ని పాఠశాలలకు నిధులు మంజూరవుతాయన్నారు. సీఎం కేసీఆర్ కృషితో రాష్ట్రంలో రూ. 7వేల కోట్లకు పైగా నిధులతో మన ఊరు – మన బడి పనులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతిపాండు, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ఆర్డీఓ సూరజ్‌కుమార్, డీఈఓ సుశీందర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, ఎంపీడీఓ వెంకట్రాములు, ఎంఈఓ కృష్ణయ్య పాల్గొన్నారు.

**పేదలకు వరం.. సీఎం సహాయ నిధి**

మహేశ్వరం: సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్డీ తండాకు చెందిన రమావత్ పరుశురామ్ నాయక్‌కు రూ. 37,500 సీఎం సహాయ నిధి చెక్కును మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పేదల సంక్షేమం కోసం తాను నిరంతరం పని చేస్తానన్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా ఉండి సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్డీ తండా సర్పంచ్ మెగావత్ రాజు నాయక్, ఉప సర్పంచ్ ఉర్మిల, నాయకులు అంధ్యా నాయక్, గోపాల్ నాయక్ పలువురు పాల్గొన్నారు.

### నిధుల మంజూరు

మంచాల: గ్రామ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మంచాల మండలంలోని జాపాల గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణం కోసం ఎమ్మెల్యే గురువారం రూ. 20లక్షలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో జాపాల గ్రామ ఉప సర్పంచ్ మల్లప్ప, బీఆర్ఎస్ నాయకులు నాగరాజు, చంద్రకాంత్, సతీష్, నోముల కుమార్, సంజీవ, వట్టి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### గొర్లకాపరుల సంక్షేమానికి ప్రాధాన్యత: మాజీ ఎంపీపీ

తలకొండపల్లి: గొర్రెలు, మేకల పెంపకందార్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో గొర్రెలు, మేకల పెంపకందార్ల సంక్షేమ సంఘం–2023 నూతన సంవత్సరక్యాలెండర్‌ను ఆయన, సంఘం నాయకులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. గొర్రెలు, మేకల సంరక్షణకోసం, వాటి షెడ్ల నిర్మాణానికై అవసరమైన నిధులు మంజూర్‌కు కృషి చేయనున్నట్లు తెలిపారు. సంఘం మండల అధ్యక్షుడు పెంటయ్య, ఉపాధ్యక్షుడు మల్లయ్య, ఎస్ఐ వెంకటేశు పాల్గొన్నారు.

### అన్ని హంగులతో పంచాయతీ భవనాలు: ఎమ్మెల్యే మంచిరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలకు అన్ని వసతులతో భవనాల నిర్మాణం చేపట్టనున్నామని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో నూతనంగా ఏర్పాటైన పిగ్లీపూర్, జాఫర్‌గూడ, గుంతపల్లి గ్రామాల్లో పంచాయతీ భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతుండగా తాజాగా మూడు గ్రామ పంచాయతీల్లో ఒక్కో పంచాయతీ భవనానికి రూ.20లక్షల చొప్పున రూ.60 లక్షలతో మూడు గ్రామాల్లో నిర్మిస్తున్న పంచాయతీ భవనాలకు శంకుస్థాపన, మజీద్‌పూర్‌లో రూ. 12లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటైన గ్రామాల్లో ఇకనుంచి సౌకర్యవంతమైన పంచాయతీ భవనాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బుర్ర రేఖా, జెడ్పీటీసీ దాసుగౌడ్, వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, బాటసింగారం సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి, సర్పంచ్‌లు కోటా రాధాలక్ష్మారెడ్డి, లావణ్యరాధాక్రిష్ణ, పోచంపల్లి సుధాకర్‌రెడ్డి, వెంకటేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌గౌడ్, ఆయా గ్రామాల ఎంపిటీసీలు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

### బైక్‌ను ఢీకొట్టిన కారు

ఇబ్రహీంపట్నం రూరల్: బైక్‌ను కారు ఢీకొకట్టగా విద్యార్థికి తీవ్ర గాయలైన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఆదిబట్ల ఎస్ఐ లక్ష్మీనారయణ కథనం ప్రకారం.. మంకు పృథ్వీ సింహా అనే విద్యార్థి ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. బొంగ్లూర్ ఔటర్ రింగ్‌రోడ్డు మొదటి రింగ్ వద్దకు వెళ్లగానే ఓ కారు అతి వేగంగా వచ్చి పృథ్వీ సింహా బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పృథ్వీసింహాకు తీవ్ర గాయలయ్యాయి. ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి అతడిని తరలించారు. తండ్రి మంకు మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## 'కంటి వెలుగు' శుభారంభం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమం గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. మహేశ్వరం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఉదయం నుంచే వైద్యులు కంటి పరీక్షలు ప్రారంభించారు. దృష్టి లోపం, ఇతర కంటి జబ్బులు ఉన్న వారు అందుబాటులో ఉన్న శిబిరాల వద్దకు చేరుకొని పరీక్షలు చేయించుకున్నారు. అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. మరి కొందరికి కంటి అద్దాలు ఇచ్చారు. దృష్టి లోపం ఉన్న వారికి శస్త్ర చికిత్సలకు రెఫర్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



హుడాకాంప్లెక్స్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి



పహాడీషరీఫ్: కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ అబ్దుల్లా సాది తదితరులు



కందుకూరులో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు